
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం। 25। ఆగస్టు। 2025



సోమశిలలో 56.430 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 56.430 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి 19,347 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,315
3 శాతం జీఎస్టీతో	రూ.9,594
సవర (8 గ్రా)	రూ.76,752

గరిష్టం/కనిష్టం 35.5 /27.8

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. ఆదివారం గాలిలో తేమ 50 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి అండర్–15 బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి రాష్ట్రస్థాయి పోటీలో క్రీడాకారులకు ప్రతిభను పెంచుకునేందుకు మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు సైతం రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలను, మెడల్స్‌ను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చౌదరి జ్యూవెలర్స్ ఎండీ రాకేష్ చౌదరి, నెల్లూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మద్దిపాటి ప్రసాద్‌రావు, ట్రెజరర్ గాదంశెట్టి శ్రీకాంత్, రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేషన్ ప్రతినిధులు, అంపైర్లు పాల్గొన్నారు.

విజేతలు

- బాయ్స్ సింగిల్స్ విన్నర్– పి రోషన్ గుంటూరు, రన్నర్– విజయచంద్ర, పశ్చిమ గోదావరి
- బాలికల సింగిల్స్ విన్నర్– డీవీ యజ్ఞశ్రీ, అనంతపురం, రన్నర్– త్రిష దీప్తి, తూర్పుగోదావరి
- బాయ్స్ డబుల్ విన్నర్–భార్గవ్, విశాఖపట్నం, రన్నర్ మానస్, తూర్పుగోదావరి, షణ్ముఖవర్ధన్, ప్రకాశం
- బాలికల డబుల్ విన్నర్స్–విజయ తేజస్విని విశాఖపట్నం, త్రిష దీప్తీ ఈస్ట్ గోదావరి, రన్నర్స్ జీ సుష్మారెడ్డి నెల్లూరు, డీవీ యజ్ఞశ్రీ, అనంతపురం
- మిక్సెడ్ డబుల్స్ విన్నర్స్–మానస్, తూర్పు గోదావరి, త్రిష దీప్తి, తూర్పు గోదావరి, రన్నర్స్–డీవీ యజ్ఞశ్రీ అనంతపురం

దర్గామిట్ట ఎస్‌ఐకు సీఐగా పదోన్నతి

నెల్లూరు (క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలో ఆరుగురు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో నెల్లూరు దర్గామిట్ట ఎస్‌ఐ బి. రమేష్‌బాబు ఉన్నారు.

నేత్రపర్వం.. తెప్పోత్సవం



వెంకటాచలం: భగవాన్ శ్రీవెంకయ్యస్వామి 43వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు వేలాది సంఖ్యలో భక్తులు కోనేటి కట్టపై చేరడంతో పోలీసులు నలువైపులా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. భక్తులు కట్టపై నుంచి కిందకు దిగకుండా కట్టడి చేశారు. తెప్పోత్సవంతో ఆరాధన మహోత్సవాలు ముగిశాయి.


బిల్లుల బాదుడే బాదుడు

- 30 యూనిట్లలోపు వినియోగంపై రూ.100
- 600 యూనిట్లలోపు వాడకంపై రూ.1,000
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెంచని విద్యుత్ చార్జీలు
- ఆ ప్రభుత్వం పెంచలేదని కూటమి పెంచేసిన వైనం
- జిల్లా ప్రజలపై నెలకు రూ.50 కోట్లపైగా అదనపు భారం

ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు పేరుతో కూటమి దోపిడీ

కూటమి ప్రభుత్వం ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరుతో చార్జీల మోత మోగిస్తోంది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే చార్జీల భారాన్ని తగ్గిస్తామంటూ కోతలు కోసిన చంద్రబాబు తన అసలు రూపాన్ని బయట పెట్టుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చార్జీలు పెంచలేదని, ఆ భారాన్ని ఇప్పుడు వేయకతప్పడం లేదని చెబుతున్న కూటమి ప్రభుత్వం గృహ వినియోగదారులపై ఎడాపెడా బిల్లులతో బాదేస్తోంది.

నెల్లూరు (వీఆర్సీసెంటర్): 'ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న.. ఓడ దిగిన తర్వాత బోడి మల్లన్న' అన్నట్టు చంద్రబాబు తీరు ఉంది. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచబోమని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీలు గుప్పించిన చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలల నుంచే రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు మొదలు పెట్టాడు. దీంతో ప్రజలకు విద్యుత్ బిల్లులను చూస్తేనే షాక్ కొడుతున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ విద్యుత్ చార్జీలు పెంచలేదని దీంతో ఇంధన సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు అమాంతంగా పెంచేసింది. 2022, 2023, 2024 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలు వాడుకున్న విద్యుత్‌కు బిల్లులు చెల్లించారు. అయితే అప్పుడు వాడుకుని బిల్లులు సైతం కట్టిన వాటికి ప్రస్తుతం ఇంధన సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు కట్టాలని విద్యుత్ బిల్లుల్లో అదనంగా వేస్తున్నారు. దీంతో ప్రతి కరెంట్ బిల్లు చేతికి వస్తుందంటే సామాన్య ప్రజలు వణికిపోతున్నారు. తాజాగా 2025 సంవత్సరానికి కూడా ఇందన సర్దుబాటు, ట్రూఅప్ చార్జీలు వేస్తుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు విద్యుత్ బిల్లులు చెల్లించటం పెను భారంగా మారుతోందని పలువురు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.



కరెంట్ బిల్లుల పాపం చంద్రబాబుదే

వాస్తవానికి కరెంట్ బిల్లులు పెరగడానికి చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్య తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు, అనవసరంగా అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేశారు. దీనికి తోడు విద్యుత్ డిస్కంలకు రూ.వేల కోట్ల బకాయిలు పాపాల వల్లే గతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలపై అధిక భారం పడకుండా ట్రూఅప్, ఇందన సర్దుబాటు పేరు అరకొరగా పెంచింది. అయితే అప్పటి ప్రతిపక్షంలోని చంద్రబాబు అండ్ కో, పచ్చమీడియా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశాయి. తిరిగి ప్రజలపై బిల్లుల భారం పడకుండా అప్పట్లోనే అన్ని సర్దుబాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇష్టారీతిన విద్యుత్ చార్జీలు పెంచుతూ వచ్చింది. దీనికి తోడు అవసరం లేకపోయినా, డిమాండ్ లేకపోయినా అత్యధిక ధరలకు ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తిదారుల నుంచి కొనుగోళ్లు చేసింది. తాజాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022, 2023, 2024 సంవత్సరాల్లో వాడుకున్న కరెంట్‌కు ట్రూఅప్, ఇందన సర్దుబాటు పేరుతో రూ.వేల కోట్ల బాదుడు బాదేస్తోంది. విద్యుత్ చార్జీలు పెరగడానికి చంద్రబాబు చేసిన పాపాలే.. విద్యుత్ వినియోగదారులకు శాపాలుగా మారాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉన్న విద్యుత్ రేట్లు

యూనిట్లు	సర్ చార్జీలు	కస్టమర్ చార్జీలు	మొత్తం
0-30	రూ.10	రూ.25	రూ.92
31-75	రూ.10	రూ.30	రూ.340
76-125	రూ.10	రూ.45	రూ.617
126-225	రూ.10	రూ.50	రూ.1,410
226-400	రూ.10	రూ.65	రూ.3,575
401-500	రూ.10	రూ.65	రూ.4,950
501-600	రూ.10	రూ.65	రూ.5,925

కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విద్యుత్ బిల్లులు

యూనిట్	సర్‌చార్జీలు	కస్టమర్ చార్జీలు	సర్దుబాటు చార్జీలు
0-30	రూ.10	రూ.25	రూ.192 పైగా
31-75	రూ.10	రూ.30	రూ.440 పైగా
76-125	రూ.10	రూ.45	రూ.850 పైగా
126-225	రూ.10	రూ.50	రూ.1,800 పైగా
226-400	రూ. 10	రూ.65	రూ.4,200 పైగా
401-500	రూ.10	రూ.65	రూ.5,800 పైగా
501-600	రూ.10	రూ.65	రూ.6,800 పైగా

నెలకు రూ.50 కోట్లపై మాటే భారం

జిల్లాలోని ప్రతి వినియోగదారుడికి విద్యుత్ బిల్లులతోపాటు వాడకాన్ని బట్టి గత ప్రభుత్వంతో పోల్చుకుంటే కూటమి ప్రభుత్వంలో అదనంగా రూ.100 నుంచి రూ.1,000 అదనంగా ఇంధన సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల రూపంలో వసూలు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మినిమం 30 యూనిట్లలోపు వినియోగంలోపు వాడకానికి అన్ని చార్జీలు కలుపుకుని రూ.92 ఉంటే.. కూటమి ప్రభుత్వంలో రూ.192లకుపైగా బిల్లు వస్తోంది. అదే 600 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని చార్జీలు కలుపుకుని రూ.5,925 వస్తే.. కూటమి ప్రభుత్వంలో రూ.6,800 పైగా బిల్లు వస్తోంది. జిల్లాలో మొత్తం గృహవిద్యుత్ కనెక్షన్లు 9,63,379 ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి నెలా ట్రూఅప్ చార్జీలు, ఇందన సర్దుబాటు చార్జీల రూపంలో దాదాపుగా రూ.50 కోట్ల వరకు అదనపు చార్జీల రూపంలో ప్రజలపై అదనపు భారం వేసి వసూలు చేస్తున్నారు.

కాకాణితో అనిల్ భేటీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ ఆదివారం భేటీ అయ్యారు. నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో కాకాణిని కలిసిన అనిల్‌కుమార్ జిల్లాలోని రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. కాకాణి ఇటీవల జైలు నుంచి విడుదలైన నేపథ్యంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

రూ.200 దొంగనోటు కలకలం



కూరగాయల దుకాణానికి వచ్చిన రూ. 200 దొంగ నోటు ఇదే

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ మార్కెట్‌లో ఆదివారం రూ.200 దొంగనోటు కలకలం సృష్టించింది. ఓ వ్యక్తి కూరగాయలు కొనుగోలు చేసి రూ.200 నోటు ఇచ్చాడని, ఆ దుకాణాదారుడు మామూలుగానే తీసుకుని అతనికి మిగిలిన చిల్లరను ఇచ్చి పంపించాడు. మధ్యాహ్నం తన దగ్గర ఉన్న నగదును మరొకరికి ఇచ్చే క్రమంలో ఈ రూ.200 నోటు దొంగనోటుగా అవతల వ్యక్తి గుర్తించాడు. దీంతో పలువురికి చూపించగా దొంగనోటు అని నిర్ధారణ అయింది. ఈ విషయం పోలీసుల దృష్టికి రాగా, ఇకపై దుకాణాదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వచ్చిన వారిని గుర్తించి తమకు తెలియజేయాలని ఆత్మకూరు పోలీసులు చెబుతున్నారు. ఇటీవల మర్రిపాడు మండలంలో మద్యం దుకాణానికి సైతం రూ.200 నకిలీ నోటు వెలుగులోకి రావడంతో కలకలం రేగిన విషయం విదితమే. తాజాగా ఆత్మకూరులోనూ ఆ తరహాలో రూ.200 నకిలీ నోటు రావడంతో రూ.200 నోట్లు తీసుకోవడానికి వ్యాపారులే కాకుండా.. ప్రజలు సైతం భయపడుతున్నారు. దీన్ని బట్టి ఆత్మకూరు పరిసరాల్లోనే రూ.200 నకిలీ నోట్ల తయారు చేసి చెలామణి చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విచారణాధికారి ఎదుట కాకాణి హాజరు



విలేకరులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (క్రైమ్): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పొదలకూరు మైనింగ్ కేసులో విచారణాధికారి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఎదుట హాజరయ్యారు. పొదలకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా విచారణాధికారి ఎదుట హాజరు కావాలని కాకాణికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు కాకాణి డీఎస్పీ ఎదుట హాజరయ్యారు. కేసులు కోర్టు పరిధిలో ఉన్న దృష్ట్యా వాటి గురించి తానేమి మాట్లాడలేనని విలేకరులు అడిగిన ప్రశ్నకు కాకాణి సమాధానమిచ్చారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు ఒడిశా వాసులు అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): ఆర్టీసీ బస్సులో గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు ఒడిశా వాసులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. నెల్లూరు బీవీనగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.అనిత వివరాలు వెల్లడించారు. వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టగా తిరుపతి వెళుతున్న ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కోపరాకు చెందిన శ్యాంపతి కారా, మోతిసింగ్ పుటియాలను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగ్‌లను తనిఖీ చేయగా 10 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం కోరాపూరులో గంజాయిని కొనుగోలు తిరుపతిలో విక్రయించేందుకు తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో నిందితులిద్దరిని, స్వాధీనం చేసుకున్న గంజాయిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు–2 స్టేషన్‌లో అప్పగించారు. వారు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ సీహెచ్ పూర్ణకుమార్, హెచ్‌సీలు ఎ. శ్రీనివాసులు, ఎం.కిరణ్‌సింగ్, కానిస్టేబుల్ టి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

పైసలిస్తేనే పరుగు

ప్రభుత్వ ఆస్పత్రులకు కాన్పు కోసం వచ్చే నిరుపేద మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఉచిత 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ లంచాలిస్తేనే పరుగులు పెడుతోంది. అడిగినంత ఇస్తేనే ఇంటి వద్దకు చేరుస్తున్నారు. ఇవ్వలేమంటే వాహనం మరమ్మతులకు గురైందని, రాలేమంటూ తప్పించుకుంటున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన ఏజెన్సీ ప్రతినిధులు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రైవర్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగిపోతోంది.

గత వారంలో మర్రిపాడు మండలం అనంతపురం గ్రామానికి చెందిన ఓ నిరుపేద గర్భిణి కాన్పు కోసం నెల్లూరు పెద్దాస్పత్రిలో చేరింది. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. శనివారం డాక్టర్లు ఆమెను డిశ్చార్జి చేశారు. తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఉచితంగా వెళ్లాలని సంబంధిత డాక్టర్ ఆమెకు చెప్పారు. దీంతో ఆమె తన తల్లితో కలిసి పసిబిడ్డను ఎత్తుకుని హాస్పిటల్ ఆవరణలో ఉన్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం వద్దకు చేరింది. దీంతో వాహన డ్రైవర్ శ్రీను అంతదూరం రామన్నారు. రూ 3 వేలిస్తే వస్తామని, చివరకు రూ.2,500 ఇస్తే వాహనంలో ఇంటికి చేరుస్తానన్నాడు. బయట ప్రైవేట్ వాహనం అయితే రూ.6 వేలు చెప్పడంతో విధి లేక ఆ డబ్బులిచ్చి ఇంటికి వెళ్లారు. గ్రామానికి వెళ్లాక ఆమె బంధువులు 102 తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు డబ్బులిచ్చేటప్పుడు వీడియో తీశారు. ఈ విషయం మరో మారు చర్చనీయాంశమైంది. ఇలాంటి ఘటనలు ఒక్క పెద్దాస్పత్రిలోనే కాదు జిల్లాలోని ఇతర ప్రభుత్వాస్పత్రుల్లో జరుగుతున్నాయి.

- ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులకు వచ్చేది పూటగడవని మహిళలే
- ఉచితంగా ఇంటి వద్ద దించాల్సిన సిబ్బంది నగదు డిమాండ్
- దూరాన్ని బట్టి రూ.2 వేల నుంచి 3 వేల వరకు గుంజుతున్న డ్రైవర్లు
- అధికారుల పర్యవేక్షణ శూన్యం.. పక్కదారి పట్టిన పథకం

నెల్లూరు (అర్బన్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు జరిగిన తల్లి, బిడ్డతోపాటు సహాయకులను క్షేమంగా ఉచితంగా ఇంటికి చేర్చేందుకు 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో అరబిందో ఏజెన్సీ ప్రభుత్వం ద్వారా కాంట్రాక్ట్ పొందింది. ఈ ఏజెన్సీ నియమించిన డ్రైవర్లు తల్లి,బిడ్డను వాహనం ద్వారా ఇంటి వద్ద దించి రావాలి. జిల్లాలో నెల్లూరు నగరంలోని పెద్దాస్పత్రి ఎంసీహెచ్ బ్లాక్ వద్ద 8 వాహనాలు, ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో 3 వాహనాలు, కావలి ఏరియా ఆస్పత్రిలో 2, కోవూరులో 2, ఉలవపాడులో 1, కందుకూరులో 1, పొదలకూరులో 1, ఉదయగిరిలో 1 వాహనాలున్నాయి. వీటి ద్వారా కాన్పు జరిగిన తల్లి బిడ్డలను ఇంటికి చేర్చుతున్నారు.



తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెరిగిన వాహనాలు

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో 10 వాహనాలు మాత్రమే ఉండేవి. దీంతో వాహనాలు చాలక కాన్పు జరిగిన మహిళలు ఇబ్బంది పడేవారు. కాన్పు జరిగిన వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు డిశ్చార్జి అయ్యాక ఆ ఇద్దరు మహిళలు, ఇద్దరు చంటి బిడ్డలు, సహాయకులు వాహనంలో ఎక్కేందుకు స్థలం ఉండేది కాదు. ఇరుకుగా తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేసేవారు. ఒకరిని ఒక గ్రామంలో వదిలి పెట్టాక మరొకరు తమ గ్రామం వచ్చే వరకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక ఈ ఇబ్బందులను గమనించి వాహనాల సంఖ్యను 19 వరకు పెంచింది. తల్లీబిడ్డతోపాటు సహాయకురాలిని మాత్రమే వాహనంలో ఎక్కించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇబ్బందులు తగ్గాయి.

పర్యవేక్షణ లేక లంచాలు

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు డీఎంహెచ్‌ఓ పరిధిలో ఉంటాయి. అరబిందో ఏజెన్సీ ప్రతినిధి, డీఎంహెచ్‌ఓ కంట్రోల్‌లో పని చేయాలి. డీఎంహెచ్‌ఓ వివిధ ఆస్పత్రులకు వాహనాలు కేటాయించాక ఆయా ఆస్పత్రిల సూపరింటెండెంట్లు అక్కడ పర్యవేక్షించాలి. అయితే ఇక్కడ పర్యవేక్షణ కరువైంది. ఉదాహరణకు పెద్దాస్పత్రిలో 8 వాహనాలుండగా అక్కడి అడ్మినిస్ట్రేషన్ అధికారిని 102 వాహనాల గురించి అడగగా డీఎంహెచ్‌ఓ కంట్రోల్‌లో ఉన్నాయి. తమకు సంబంధం లేదన్నట్లు సమాధానం ఇచ్చారు. డీఎంహెచ్‌ఓ కూడా ఇప్పటి వరకు వీటి గురించి పట్టించుకోలేదు. ఏ రోజు ఏ వాహనం ఎక్కడికి వెళ్లింది.. సమయం, కాన్పు జరిగిన మహిళ పేరు, డ్రైవర్ పేరు ఇలాంటి వివరాలు నమోదు చేసే రికార్డులు పెద్దాస్పత్రిలో కూడా లేవు. ఇంత నిర్లక్ష్యం ఉండటంతో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా పేద రోగుల నుంచి లంచాలు వసూలు చేస్తున్నారు. అడిగే నాథుడే లేకపోవడంతో డ్రైవర్లు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా తయారైంది. రోజుకు ఒక్కో డ్రైవర్ కనీసం రూ.1000 సంపాదిస్తారు. ఈలెక్కన నెలకు రూ.30 వేలు అదనంగా రోగుల వద్ద నుంచి లాక్కుంటున్నారు.

డబ్బు తీసుకున్న వారిపై కఠిన చర్యలు

102 తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా కాన్పు జరిగిన మహిళలను ఉచితంగా ఇంటి వద్ద వదిలి రావాలి. డబ్బులు తీసుకుంటున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల రూ. 2,500 వసూలు చేసిన డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించాం. ఈ మేరకు నోటీసుకూడా ఇచ్చాం. ఎవరైనా డ్రైవర్లు లంచం అడిగితే మా దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

ఇంటికెళ్తుండగా..

• రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి
• చికిత్స పొందుతూ మృతి


విష్ణు మృతదేహం

కోవూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన వరికుంట్ల విష్ణు (32) రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్నాడు. అతడికి భార్య పావని, కుమార్తె వర్షిణి ఉన్నారు. మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతిరోజూ కొలువు మేళం వాయిస్తుంటాడు. ఈనెల 23న ఉదయం కుమార్తెను మోటార్‌బైక్‌పై తీసుకెళ్లి స్కూల్లో వదిలాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేసింది. తాను కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో హెయిర్ కటింగ్ చేయించుకుని వస్తున్నానని చెప్పాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నార్తురాజుపాళెం నుంచి ఇంటి వైపు బయలుదేరిన విష్ణు వెంకటేశ్వరపురం సమీపంలోని వాగుమిట్ట వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తల, కన్నుపై, భుజం, కాలు, వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం చనిపోయాడు. విషయం తెలుసుకున్న పావని భర్త మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య


జయరామయ్య మృతదేహం

సంగం: మండలంలోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో పెదవీడు జయరామయ్య (61) అనే వృద్ధుడు ఆదివారం దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పాదచారుల వంతెనపై బ్యాగ్, చెప్పులు వదిలి అందరూ చూస్తుండగానే కాలువలో దూకినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడిది పొదలకూరు మండలం ముదిగేడు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

'అగ్నివీర్'కు 159 మంది అర్హత


ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

తిరుపతి రూరల్: అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షలో ఎస్వీ డిఫెన్స్ అకాడమీకి చెందిన 159 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆ అకాడమీ చైర్మన్ బి.శేషారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇచ్చామని, వారు ఉద్యోగంలో చేరడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. 159 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

రియల్ నేలచూపులు

రియల్ ఎస్టేట్ కళ తప్పింది. సంవత్సరం క్రితం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో భూముల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతుండేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షోభం ఏర్పడింది. కొనేవారు ఆసక్తి చూపకపోవడంతో ఖాళీగా ఉంటున్నాయి. ప్రభుత్వం భూముల విలువ పెంచడంతో బిల్డర్లు, రియల్టర్లకు గడ్డుకాలం నడుస్తోంది.

• కూటమి ప్రభుత్వంలో స్థిరాస్తి రంగం కుదేలు
• భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు తగ్గుముఖం
• విక్రయాలకు నోచుకోని నూతన భవనాలు
• ఖాళీగా ఉంచుకోలేక బాడుగలకు ఇస్తున్న బిల్డర్లు
• తగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం



నెల్లూరు సిటీ: జిల్లాలో 2019 నుంచి 2024 ఆర్థిక సంవత్సరాల మధ్య క్రయ, విక్రయాలు భారీగా జరిగాయి. 70 శాతానికి తగ్గకుండా లక్ష్యాలను సాధించారు. 2021 – 22, 2022 – 23 ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా 90 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. కొత్త వెంచర్లు, నిత్యం రిజిస్ట్రేషన్లతో కార్యాలయాలు కళకళలాడాయి. ప్రస్తుతం భూములను అమ్మేవారు ఉన్నా.. కొనేవారు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి చంద్రబాబు ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ విలువలను పెంచింది. దీంతో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 62.39 శాతం మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2025 – 26లో ఏప్రిల్ నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు 37,159 రిజిస్ట్రేషన్లు జరిగాయి. లక్ష్యం రూ.265.28 కోట్లు కాగా అధికారులు రూ.176.07 కోట్లు సాధించారు. 66.37 శాతంగా నమోదైంది.

భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

జిల్లాలో మొత్తం 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. రోజూ కనీసం 150 నుంచి 350కి పైగా భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. నెల్లూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో ఈ సంఖ్య ఎక్కువ. కావలి, ఆత్మకూరు, బుచ్చి, నెల్లూరు, బుజబుజనెల్లూరు ప్రాంతాల్లో అత్యధికంగా జరుగుతుండేవి. భవిష్యత్‌లో భూముల ధరలు పెరుగుతాయని నిత్యం క్రయ, విక్రయాలు నిర్వహిస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో రియల్టర్లు లేఅవుట్‌లు సైతం భారీగా వేసేందుకు ముందుకు వచ్చేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. క్రయ, విక్రయాల్లేక రియల్టర్లు తలలు పట్టుకుంటున్నారు.

ఆర్థిక సంవత్సరం	శాతం	రిజిస్ట్రేషన్లు
2019 - 20	74.03	62,930
2020 - 21	79.90	65,036
2021 - 22	94.67	1,18,787
2022 - 23	93.33	1,42,348
2023 - 24	71.72	1,88,229
2024 - 25	62.39	93,772


నెల్లూరు నగర వ్యూ (ఫైల్)

కొనేవారు లేక..

జిల్లాలో రియల్ ఎస్టేట్ బాగుంటుందని హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి వచ్చిన రియల్టర్లు లేఅవుట్‌లు వేశారు. బిల్డర్లు అన్ని సదుపాయాలతో ఇళ్ల నిర్మాణాలు కూడా చేశారు. అయితే ఇప్పుడు కొనేవారు లేక రియల్ ఎస్టేట్ పడిపోయింది. రూ.కోట్లు ఖర్చు చేసి అపార్ట్‌మెంట్లు నిర్మించినా కొనుగోలుదారులు ఆసక్తి చూపకోవడంతో ఖాళీగా పెట్టుకున్నారు. కొందరు బిల్డర్‌లు ఇళ్లను విక్రయించలేక బాడుగకు ఇస్తామని బోర్డులు పెట్టిన పరిస్థితులున్నాయి. అనేకమంది వడ్డీలు చెల్లించలేక లబోదిబోమంటున్నారు.

2024 - 25లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో..

రిజిస్ట్రేషన్ కార్యాలయం	శాతం	రిజిస్ట్రేషన్లు
కందుకూరు	63.07	8,600
అల్లూరు	82.97	3,603
ఆత్మకూరు	79.59	6,469
బుచ్చి	66.24	6,469
ఇందుకూరుపేట	69.81	4,477
కావలి	57.51	11,062
కోవూరు	88.41	5,699
ముత్తుకూరు	88.75	5,741
పొదలకూరు	58.06	4,985
రాపూరు	50.35	1,867
ఉదయగిరి	77.69	3,726
వింజమూరు	60.02	4,780
నెల్లూరు (ఆర్‌ఓ)	56.16	15,726
స్టోన్‌హౌస్‌పేట	57.38	7,768
బుజబుజనెల్లూరు	67.67	4,512

నెల్లూరులో కార్డన్ సెర్చ్


ప్రజలతో మాట్లాడుతున్న ఏఎస్పీ, డీఎస్పీ

• 120 వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాలతో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పి.సింధుప్రియ పర్యవేక్షణలో పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ చేపట్టారు. చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప, నవాబుపేట పరిధిలోని ఉడ్‌హౌస్ సంఘం, సంతపేట పరిధిలోని కపాడిపాళెం, దర్గామిట్ట పరిధిలోని ప్రగతినగర్, వేదాయపాళెం పరిధిలోని వైఎస్సార్ నగర్, బాలాజీనగర్ పరిధిలోని వెలగచెట్టు సంఘంలో ఏకకాలంలో తనిఖీలు జరిగాయి. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 113 మోటార్‌బైక్‌లు, ఏడు ఆటోలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రౌడీషీటర్ల ఆగడాలు, ఈవ్‌టీజింగ్ తదితరాలను గుర్తిస్తే స్థానిక పోలీసులకు, డయల్ 112కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. నేరనియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. తనిఖీల్లో నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, జి.వేణుగోపాల్‌రెడ్డి, జి.దశరథరామారావు, ఎం.రోశయ్య, కె.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, ఎస్సైలు, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్

ఘనంగా 'ఓనం' పండగ

• పదేళ్ల తర్వాత కేరళీయులతో మమేకం కావడం ఆనందంగా ఉంది
• కళాశాల రోజులు గుర్తుకొచ్చాయి
• కలెక్టర్ ఆనంద్


ఉత్సవాలకు పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పురమందిరంలో ఆదివారం ఓనం మహోత్సవాలు – 2025 ఘనంగా జరిగాయి. కలెక్టర్ ఒ.ఆనంద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ అయిన తాను 10 సంవత్సరాల క్రితం కేరళను వీడానన్నారు. వృత్తి బాధ్యతల నడుమ కేరళీయులైన మలయాళీయులతో జరిగిన ఏ పండగల్లో, సమావేశాల్లో పాల్గొనే అవకాశం కలగలేదన్నారు. నేడు ఓనం వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాశాల రోజులు గుర్తుకొస్తున్నాయంటూ సంతోషం వ్యక్తం చేశారు. మాతృభూమిలో ఉన్నట్లు ఉందన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గొలగమూడిలో నిర్మించనున్న ఆయుర్వేదిక్ హాస్పిటల్‌కు తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు.

• నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గొలగమూడి దగ్గర నిర్మితమయ్యే ఆయుర్వేదిక్ హాస్పిటల్‌కు రూ.2 లక్షలు విరాళంగా అందజేస్తానని ప్రకటించారు.

• 25 కళా సంఘాల అధ్యక్షుడు, రాష్ట్ర హోటల్స్


మహిళల కోలాహలం

అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని సుమారు మూడు వేలకు మందికి పైగా మలయాళీయులు 23 సంవత్సరాలుగా 'ఓనం' వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు పీజీ గోపి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు బిందు దివాకరన్, ఎంకే నందకుమార్, ఎ.మురుగన్, మధు పులియత్, వినోదిని ప్రమోద్, పి.సిద్ధోష్, పచ్చప్పన్, సీఎస్.శివరామ, సాదికా అన్సారి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ మలయాళీయులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్యోతి శ్రీధర్ ఆర్థిక సహాయంతో ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ అందజేశారు. జిల్లాలో వివిధ రంగాల్లో సుప్రసిద్ధులైన 10 మంది సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించారు. దొర్నాల హరిబాబు పాల్గొన్నారు.

కోలాహలంగా రథోత్సవం



వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో భగవాన్ శ్రీవెంకయ్యస్వామి 43వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం నేత్రపర్వంగా సాగాయి. చివరిరోజు భక్తులతో గొలగమూడి కోలాహలంగా మారింది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అత్యధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి బాలసుబ్రహ్మణ్యం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వారికి తాగునీరు అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గొలగమూడికి చేరుకునే రెండు మార్గాల్లో పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. అలాగే రెండు చోట్ల వైద్య శిబిరాలను పెట్టారు.

• రథోత్సవం కోలాహలంగా సాగింది. స్వామిని ఆభరణాలు, ప్రత్యేక పూలతో అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. పచ్చా శ్రీహరినాయుడు బ్రదర్స్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

• ప్రథమ స్థానంలో అనంతపురం జట్టు


అనంతపురం జట్టుతో అసోసియేషన్ సభ్యులు, అతిథులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రథమ స్థానంలో అనంతపురం జట్టు, ద్వితీయ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టు, తృతీయ స్థానంలో నెల్లూరు జిల్లా జట్టు నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రంజీ మాజీ క్రికెటర్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. సీనియర్ క్రీడాకారుడు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులు నేతృత్వంలో సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆనంద్, చిట్టి, చలపతి, ప్రభాకర్, అనిల్, శిరీష్, రవి విజేతలకు జ్ఞాపికలు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.చంద్రశేఖర్, కోచ్‌లు పాండు, సాయి పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.105
లేయర్	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.196
స్కిన్‌లెస్ చికెన్	: రూ.216
లేయర్ చికెన్	: రూ.200

కండలేరుపైనే ఆశలు

• సోమశిల నుంచి జోరుగా వరద నీరు
• ఈ సీజన్‌కు ఢోకా లేదు


జోరుగా ప్రవహిస్తున్న కైవల్యా నది

సైదాపురం: నెల్లూరు, తిరుపతి జిల్లాలకు వరప్రదాయినిగా ఉన్న కండలేరు జలాశయంలోకి రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతోంది. దీంతో నాన్ డెల్టా రైతుల్లో ఆశలు మరింత చిగురిస్తున్నాయి. కండలేరులో ఇప్పటికే 30 టీఎంసీల నీటి నిల్వలు ఉండటంతో ఈ సీజన్ సాగుకు ఢోకా లేదని భావిస్తున్నారు. నెల్లూరు జిల్లాతోపాటు తిరుపతి జిల్లాలోని కొన్ని మండలాలకు ఈ జలాశయం ద్వారా సాగునీరును విడుదల చేశారు.

పెరుగుతున్న వరద

కండలేరు 30 టీఎంసీలకు చేరింది. దీనికితోడు రోజూ సోమశిల జలాశయం నుంచి 9400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సెప్టెంబర్ నెలాఖరుకు 50 టీఎంసీలు నీరు చేరు అవకాశం ఉందని అధికారులతోపాటు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కండలేరులో పుష్కలంగా నీరు ఉండటంతో ఆయకట్టు రైతులకు రబీపై మరింత భరోసా కలిగింది.

ఆగస్టులో డెడ్ స్టోరేజ్

ఆగస్టు నెలలో కండలేరు డెడ్ స్టోరేజీకి చేరుకుంది. సోమశిల జలాశయం నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం నీటి నిల్వ పెరుగుతోంది. ప్రధానంగా సర్వేపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాలకు చెందిన రైతులు కండలేరు నుంచి వచ్చే నీటిని ఆధారం చేసుకుని రబీ పంటలు సాగు చేస్తున్నారు.

చెరువులకు సాగునీరు

కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600 క్యూసెక్కులు, పిన్నేరు కాలువకు 30, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కులు, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నారు. దీంతో చెరువులకు సాగునీరందే అవకాశం ఉంది. ఈ జలాశయం పరిధిలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నెల్లూరు, తిరుపతి జిల్లాలో ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగునీటి అవసరాలకు విడతల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా..



రబీ సీజన్‌కు రైతుల ఆశలు తీరనున్నాయి. నాన్‌డెల్టా ప్రాంత రైతులు రబీ సీజన్‌లో పంటలు పండించుకునే అవకాశం ఏర్పడింది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది.

– రాంగోపాల్‌రెడ్డి, గులించెర్ల, సైదాపురం మండలం

కైవల్యా నదికి గంగనీరు



ఈ ఏడాది సాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డాం. కానీ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో కండలేరు జలాశయంలో 30 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. కండలేరు నుంచి కైవల్యానదికి నీరును విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందుల్లేవు.

– శివకుమార్, సైదాపురం